క్లుప్తంగా

ప్రమాదబీమా చెక్కు అందజేత

పెంట్లవెల్లి: మండల కేంద్రానికి చెందిన మత్స్యకారుడు జంగిడి ఆంజనేయులు చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతిచెందిన విషయం విధితమే. ప్రభుత్వం నుంచి మత్స్యశాఖ ప్రమాద ఇన్సూరెన్స్ కింద రూ.5 లక్షలు మంజూరు కాగా డీఎఫ్‌డీఎస్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు బాధిత కుటుంబానికి బుధవారం చెక్కు అందించారు.

రూ.40వేలు మంజూరు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన రాజేశ్వరికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.40వేల చెక్కును బుధవారం కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కృష్ణ అందజేశారు.

మాలల చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ



కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 18, 19, 20 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన పోస్టర్లను బుధవారం మాల మహానాడు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలమంద శేఖర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందన్నారు. దీనిని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీలను విభజించడం సరైంది కాదన్నారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట ఉద్యమానికి దళితులు సంఘటితమై పోరాడాలన్నారు. నాయకులు సందీప్‌కుమార్, వెంకట్రాములు, శివ తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: సీపీఐ రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యదర్శి శ్రీనివాసులు బుధవారం ఆవిష్కరించారు. ఈ నెల 20వ తేదీన మేడ్చేల్ మల్కాజ్‌గిరిలో నిర్వహించే సీపీఐ మహాసభలకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయ భవన నిర్మాణం కోసం బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయానికి స్వంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో గ్రంథాలయం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠకులకు ఇబ్బందులు లేకుండా స్వంత భవనం నిర్మాణం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగేషు పాల్గొన్నారు.

పాలెం యూబీఐలో తనిఖీలు

బిజినేపల్లి: మండలంలోని పాలెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను బుధవారం యూబీఐ బ్యాంకు రీజినల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఖాతాదారులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేవైసీ సమస్యను బ్యాంకులోనే పరిష్కరించాలని, అందుకు ప్రత్యేకంగా కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలని ఖాతాదారులు విన్నవించారు. త్వరితగతిన రెన్యూవల్ చేయాలని బ్యాంకు సిబ్బందిని ఆదేశించారు. అధికారులు రమేష్‌బాబు, రాజేష్ బాబు, మెనేజర్ శ్రవణ్ తదితరులు ఉన్నారు.

కారును వదిలేసి పారిపోయిన దొంగలు

తిమ్మాజిపేట: గొర్రెల దొంగతనానికి వచ్చిన దొంగలను కాపరులు ప్రతిఘటించడంతో కారును వదిలేసి పారిపోయిన ఘటన బుధవారం మండలంలోని వెంకాయపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు వెంకాయపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలో కృష్ణకుమార్‌కు సంబంధించిన గొర్రెలను రేకులషెడ్డులో ఉంచి అతని కారులో నిద్రించాడు. తెల్లవారుజామున గొర్రెల అరుస్తున్న శబ్దం విని లేచిచూడగా గొర్రెలను ఎత్తుకెళ్తనట్లు గమనించి కేకలు వేశాడు. దొంగలు అతడిని కొడుతుండగా తల్లిదండ్రులు సమీపంలో ఉన్న మరో వ్యక్తి వచ్చి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేయగా దొంగలు తీసుకొచ్చిన కారును వదిలి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాలల తనిఖీ

ఉప్పునుంతల: మండలంలోని జప్తీ సదగోడు ప్రాథమికోన్నత, మొల్గర ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఎంఈఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను, ఇతర రికార్డులను పరిశీలించారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

చారకొండ: మండలంలోని గైరాన్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. గురువారం నిర్వహించే తీజ్ వేడుకలకు ఆహ్వానించారు.



కోడేరులో మినీ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరిన మురుగు



అమ్రాబాద్ మండలం రజకకాలనీలో..

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో టాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. వర్షాకాలంలో ఎప్పుడు ఏప్రమాదం చోటుచేసుకుంటుందోనని పలు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కున కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయలేదు. కొన్ని చోట్ల చెట్ల పొదల్లో, చెత్తాచెదారంలో దర్శనమిస్తున్నాయి. తాడూరులో పాఠశాల సమీపంలోనే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కోడేరు మండలంలోని జనుంపల్లి గ్రామంలో స్థానిక బస్టాండ్ వద్ద మినీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. అమ్రాబాద్ రజక కాలనీలో దోబీఘాట్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు చెట్లు ఏపుగా పెరిగి కన్పించడం లేదు.

–తాడూరు/కోడేరు/అమ్రాబాద్



తాడూరులో చెట్ల పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ సమస్య రాకుండా చూడాలి

అచ్చంపేట: భారీ వర్షాల కారణంగా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిమడుగు ఆలయ అభివృద్ధికి కృషి

అమ్రాబాద్: మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం మద్దిమడుగు ఆంజనేయస్వామిని దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన సులబ్‌కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. అంతకుముందు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పలికి శేషవస్త్రాలు అందజేశారు.



అచ్చంపేట సబ్ డివిజన్ విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పథకాలపై ఆరా

మండల కేంద్రమైన పదర సమీపంలో పత్తిపంటలో ఎరువులు వేస్తున్న కూలీలతో ఎమ్మెల్యే వంశీకృష్ణ ముచ్చటించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రామలింగయ్యయాదవ్, జెట్టిప్ప, ఆనంద్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడుదాం

కోడేరు: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడుదామని ప్రిన్సిపాల్ భగవేణి నర్సింహులు అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముకలాంటివారని వారు సన్మార్గంలో పయనిస్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. పద్మావతమ్మ, రమేష్, వెంకన్న, బోజ్యానాయక్, నాగులమీరా, వంశీకృష్ణ, బాలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై నిషేధంపై ప్రతిజ్ఞ



కల్వకుర్తి టౌన్: మాదకద్రవ్యాల వాడకంతో కుటుంబాలు చిద్రం అవుతున్నాయని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, ఇతర సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ ఏఈ షబ్బీర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్ తనిఖీ



అచ్చంపేట రూరల్: చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా ఉన్న నియోనేటల్ కేర్ 108 అంబులెన్సు సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేనేజర్ శ్రీను కోరారు. బుధవారం అచ్చంపేటలోని నియోనేటల్ కేర్ అంబులెన్సును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్సులోని వైద్య పరికరాలు, మందులు, వివిధ అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో అంబులెన్సు సిబ్బంది శివరాజ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు సరికాదు

కల్వకుర్తి టౌన్: కాంగ్రెస్ నాయకులపై అసత్య ప్రచారాలు మానుకోవాలని బీజేపీ నాయకులకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ పారదర్శంగా పథకాలు అందుతున్నాయని కాని కొందరు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చౌకబారు రాజకీయ ఆరోపణలను చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి జయంతి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో అఖిల భారత మాజీ కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, పర్వతాలు, రేణయ్య, అమరేందర్‌గౌడ్, బాలయ్య, శివనాయక్, సుభద్ర, వెంకటమ్మ పాల్గొన్నారు.

ప్రత్యర్థిపై నేరం మోపేందుకు కిడ్నాప్ నాటకం

పెంట్లవెల్లి: మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన కర్ణికం మల్లయ్య, మహేష్‌లు ప్రత్యర్థి బన్నెల రాముడిపై నేరం మోపేందుకు కిడ్నాప్ నాటకం ఎత్తారని ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం భర్త కన్పించడం లేదని సోమవారం మల్లయ్య భార్య మానస ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. కొన్నాళ్ల నుంచి కర్ణకం మల్లయ్య, మహేష్‌లకు గ్రామానికి చెందిన రాముడితో తగాదాలు ఉన్నాయి. రాముడిపై నింద మోపాలని అక్కసుతో బయన్నగట్టుపై గొర్రెల మంద దగ్గర మల్లయ్య కాళ్లు, చేతులను మహేష్ కట్టేసి నోట్లో గుడ్డ కుక్కి వెళ్లారు. కిడ్నాప్‌కు గురైనట్లు ఫిర్యాదు అందడంతో అనుమానితులను విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో ప్రత్యర్థిపై నింద మోపేందుకు నాటకం ఆడినట్లు మల్లయ్య సోదరుడు మహేష్ ఒప్పుకున్నాడు. ఇందులో ఎవరి ప్రమేయం లేదని వివరించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ఉప్పునుంతలలో ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎంపీ పోతుగంటి రాములు



కల్వకుర్తిలో తిరంగా ర్యాలీ

సాక్షి, నెట్‌వర్క్: హర్ ఘర్ తిరంగా ర్యాలీలో భాగంగా బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేశారు. ఉప్పునుంతలలో ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎంపీ పోతుగంటి రాములు ఎగురేశారు. బిజినేపల్లి మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో బిజినేపల్లి గ్రామ వీధుల్లో హర్ ఘర్ స్వచ్ఛతాపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. తెలకపల్లి మండల కేంద్రంలోని సీఎల్ఆర్ కళాశాల నుంచి నెహ్రూ చౌరస్తా వరకు మాజీ సైనికులతో, విద్యార్థులతో కలిసి బీజేపీ నాయకులు ర్యాలీ తీశారు. లింగాలలో జాతీయ జెండాలు పట్టుకొని నినాదాలు చేశారు.

మార్చాల వాసికి డాక్టరేట్



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన డొక్కా కృష్ణ డాక్టరేట్ అందుకున్నాడు హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సై విభాగంలో బాబు జగ్జీవన్‌రామ్ ఆలోచన విధానం, రాజకీయ అభివృద్ధి, అణగారిన తరగతుల ఉద్ధరణ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ లభించింది. బుధవారం పరిశోధన పత్రాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ చల్లమల్ల వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ కృష్ణ కుమార్ ప్రొఫెసర్ శ్రీలతలు అందించారు. పలువురు ప్రొఫెసర్లు విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణను అభినందించారు. మండలంలోని మార్చాల గ్రామంలో జన్మించి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలలో విద్యాభ్యాసం చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకోవడంపై ఆయనను స్నేహితులు గ్రామస్తులు అభినందించారు.

స్పోర్ట్స్ పాఠశాలకు విద్యార్థిని ఎంపిక

తెలకపల్లి: మండలంలోని సిద్దార్థ మాడల్ పాఠశాలలో చదుతున్న ఎస్ వైష్ణవి హాకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపికైందని హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 4వ తరగతిలో చదవడానికి హకీంపేటలో ఉన్న క్రీడాపాఠశాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్, స్వేరోస్ జిల్లా నాయకులు, విద్యార్థి తల్లిదండ్రులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో పోచమ్మ దేవాలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు హోమంలో పాల్గొన్నారు. భక్తులకు భోజన ప్రసాదం అందజేశారు.

ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు జొన్నలబొగుడలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ, డీటీ రమేష్‌నాయక్ మంజూరు పత్రాలను అందజేశారు. పెద్దకొత్తపల్లిలో 60 మందికి, జొన్నలబొగుడలో 42 మందికి ఇళ్లు మంజూరయ్యాని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, కురుమూర్తి, మాజీ ఎంపీటీసీ బద్యనాయక్, శశికళశివశంకర్, లక్ష్మయ్య, నాగరాజు, మల్లేష్, శ్రీనివాసరెడ్డి , అశోక్‌రెడ్డి, చంద్రయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

రావేఫ్ విద్యార్థుల ప్రదర్శన



తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు శాస్త్రవేత్తల సహాయ సహకారాలతో గ్రామీణ భాగస్వామ్యం సదస్సు నిర్వహించారు. విద్యార్థులు గ్రామంలోని భౌగోళిక నమూనా, పంటలు వాటి విస్తీర్ణం ప్రభుత్వ రంగ సంస్థలు నమూనాలను రైతు వేదికలో ప్రదర్శించారు. అధిక వర్షపాతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గుర్తించి శాస్త్రవేత్త శంకర్ వివరించారు. పత్తి పంట ఎర్రబారితే 19-19-19 (5గ్రా.లకు లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. వర్షాలు ఆగిన తర్వాత 20 కిలోల యూరియా, 20కిలోల పోటాష్ వేసుకోవాలని అన్నారు. శాస్త్రవేత్తలు ఈశ్వర్‌రెడ్డి, శ్రీరాం, విస్తరణ అధికారి, ఏఓ సందీప్‌కుమార్‌రెడ్డి, రావేఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తెలకపల్లిలో భారీకేడ్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు

తెలకపల్లి/కొల్లాపూర్/వెల్దండ/కోడేరు/ ఉప్పునుంతల: తెలకపల్లి మండలంలోని రామగిరి, రఘుపతిపేట మధ్యలో దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బుధవారం తహసీల్దార్ జాకీర్ అలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్‌ఐ నరేష్‌లు సందర్శించి భారీకేడ్లను ఏర్పాటు చేశారు. వెంకటయ్య, ఆర్‌ఐ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

■ రానున్న మూడు రోజులు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొల్లాపూర్ సీఐ మహేష్ సూచించారు. కృష్ణానదిలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు. ఎవరైనా ప్రమాదాల బారిన పడితే వెంటనే 100కు ఫోన్ చేయాలని కోరారు.

■ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెల్దండ, కోడేరు తహసీల్దార్లు కార్తీక్‌కుమార్, విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కోడేరు మండలంలోని బావాయిపల్లి, పస్పుల వాగులను ఎస్‌ఐ జగదీశ్వర్, తహసీల్దార్ పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పునుంతల మండలం మొల్గర వద్ద..

■ ఉప్పునుంతల మండల సరిహద్దులోని దుందుభీ వాగులో మొల్గర వద్ద ఉన్న కాజ్‌వే రోడ్డుపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కాజ్‌వే రోడ్డు ముందస్తుగా బుధవారం భారీకేడ్లు అడ్డుగా పెట్టి పోలీసులతో నిఘా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెట్లు, కరెంట్ స్తంభాలు, తీగల కింద నిల్చో వద్దన్నారు. పాత ఇండ్లు, షెడ్లు వంటి వాటిల్లో ఉండొద్దన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఉప్పునుంతల: సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు విమర్శించారు. బుధవారం మండలంలోని కాంసానిపల్లిలో గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేశారు. సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న ప్రధాన రహదారి గోతులుపడి అధ్వానంగా మారడంతో గ్రామస్తులతోపాటు ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అచ్చంపేట నుంచి కాంసానిపల్లి మీదుగా సీఎం రేవంత్‌రెడ్డి స్వంత ఊరు కొండారెడ్డిపల్లి నుంచి కల్వకుర్తి, హైదరాబాద్‌కు ప్రతినిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామంలోని వీధులు, ఇండ్ల మధ్యన ఉన్న స్థలాలు కంపచెట్లు, గడ్డితో అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. వీధులు, ఇళ్ల మధ్యన ఉన్న స్థలాలను శుభ్రం చేయించాలని ఆయన కోరారు. నాయకులు రామస్వామి, రాములు, మల్లయ్య, హరిష్, నాగయ్య, కొండలు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

బోధనోపకరణాల మేళాలు

బిజినేపల్లి: ఈ నెల 20న మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిర్వహించే బోధనోపకరణాల మేళాను విజయవంతం చేయాలని ఎంఈఓ రఘునందన్‌రావు కోరారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 1 నుంచి 5వ తరగతి వరకు భోదనోపకరణాల మేళా ఏర్పాటు చేయడంపై చర్చించారు.

పోషణ కిట్ల అందజేత



కల్వకుర్తి టౌన్: టీబీ వ్యాధి నివారణలో భాగంగా సరైన పోషకాహారం తీసుకుంటే వ్యాధిని కొంతవరకు నివారించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ భీమానాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని సీహెచ్‌సీ ఆవరణలో టీబీ వ్యాధిగ్రస్తులకు నాట్కో ఆధ్వర్యంలో అందిస్తున్న పోషణ కిట్లను ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి అందజేశారు. టీబీ ముక్త భారత్‌లో భాగంగా ప్రభుత్వం నాట్కో సంస్థ వారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. నాట్కో సిబ్బంది డా.రమణారెడ్డి, మదన్ కుమార్, క్లస్టర్ ఆఫీసర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

మన్ననూర్: కొన్నిరోజుల నుంచి జంగాల కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బోనాల పండుగను పురస్కరించుకొని బుధవారం వీధిదీపాలు ఏర్పాటు చేశారు. ఆయా కాలనీలు మహిళలతో సందడిగా కన్పించింది. పంచాయితీ కార్యదర్శి భీముడుకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అందుబాటులో యూరియా

తాడూరు: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ రాంచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూరియా కొరత ఉందని కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని రైతులు వదంతులు నమ్మొద్దన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ మల్లయ్య, ఏఓ సందీప్‌కుమార్‌రెడ్డి, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



కల్వకుర్తి రూరల్: పట్టణంలో బుధవారం పోచమ్మ బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా బొడ్రాయి, కోట మైసమ్మను దర్శించుకొని పోచమ్మ దేవాలయానికి చేరుకున్నారు. పోతురాజుల విన్యాసాలతో డీజే పాటలతో ర్యాలీగా తరలివచ్చారు. బోనాల ఊరేగింపును చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎడ్మ సత్యం, రాయచోటి శ్రీశైలం, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, సూర్య ప్రకాష్ రావు, బావండ్ల మధు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక

కందనూలు: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్‌లో ఈ నెల 17వ తేదీ నుంచి 21 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పుట్‌బాల్ చాంపియన్ షిప్ 2025 పోటీలకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి నలుగురు బాలికలను ఎంపిక చేసినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం సన్మానించారు.డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేషు, వెంకటరాములు, తదితరులు పాల్గొన్నారు.

వంతెనను నిర్మించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ నుంచి నాగనూల్ గ్రామాల మధ్య వంతెనను నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నాగనూల్ – నాగర్‌కర్నూల్ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న అలుగును ఆయన పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు గీత, పోదిలిరామయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు యాదయ్య, నాయకులు భాస్కర్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మన్ననూర్: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలోని గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలో మౌలిక వసతుల కల్పించాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ చార్జీలు ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. అనంతరం ఐటీడీఏ ఏఓ జాఫర్ హుసేన్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్, మండల నాయకులు చరణ్, నాగేష్, ప్రవీణ్, విజయ్, అఖిల్, సుల్తాన్ పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘించొద్దు

అమ్రాబాద్: నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి యశ్వంత్ రావు డీలర్లను హెచ్చరించారు. బుధవారం అమ్రాబాద్, పదర మండలాల్లో పలు ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించి తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, పురుగుల మందుల విషయమై డీలర్లు రోజువారిగా స్టాక్ రిజస్టర్, బోర్డు, బిల్లులు, సేల్స్ రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట ఏడీఏ చంద్రశేఖర్, ఎంఏఓ సందీప్‌రెడ్డి తదతరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కల్వకుర్తి రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఏడు, 8వ వార్డులలో ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులు పర్యటించారు. పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయలేదన్నారు. ఆయా వార్డులో లక్ష్మమ్మ, భారతమ్మలకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ మల్లయ్య, పరుశురాములు, బాల్ రెడ్డి, చంద్రయ్య, జగన్ కాలనీవాసులు పాల్గొన్నారు.

తాడూరు: దళితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. బుధవారం బుధవారం గుంతకోడురులో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు.